**కామెడీ కథ**

# వీసా

**ఆకునూరి మురళీకృష్ణ**

**"మిస్టర్ సుబ్బారావ్,**

**ఉద్యోగం చేయడానికి అమెరికా వెళ్ళాలని వీసా కోసం నువ్వు పెట్టుకున్న దరఖాస్తు అందింది. నిన్ను వాళ్ళ దేశంలోకి రానివ్వాలా వద్దా అని అమెరికావాళ్ళు నిర్ణయించడంకన్నా ముందు అసలు నిన్ను ఆ దేశం పంపాలా వద్దా అన్న విషయం మన ప్రభుత్వం నిర్ణయించాల్సి వుంటుంది. అందుకు నువ్వు ఈ క్రింద సూచించబడిన అడ్రస్‌లో ఫలానా తేదీనాడు ఫలానా టైములో ఇంటర్వ్యూకి హాజరుకావాలి. ఆ తర్వాత మాత్రమే నీ దరఖాస్తు అమెరికన్ కౌన్సులేట్‌కి అందజేయబడుతుంది.**

ఇట్లు

ఇండియన్ కౌన్సిలింగ్ ఆఫీస్''

రిజిస్టర్ పోస్టులో వచ్చిన ఆ ఉత్తరాన్ని చూడగానే సుబ్బారావుకి మతిపోయింది. తను చదివింది నిజమేనా అన్న అనుమానంతో ఒకటికి రెండుసార్లు మళ్ళీ చదివాడు.

అదే మేటర్!

క్రింద అడ్రసూ, ఫోన్ నెంబరూ వున్నాయి.

అమెరికన్ కౌన్సులేట్ గురించి విన్నాడు కానీ 'ఇండియన్ కౌన్సిలింగ్ ఆఫీస్' గురించి వినడం ఇదే మొదటిసారి. తనకి వీసా ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న ఏజంటు కూడా తనతో ఈ విషయం చెప్పలేదు.

అడ్రస్ చూస్తే హైదరాబాద్ అడ్రసే వుంది.

సమయానికి ఆ ఏజంటు కూడా ఊర్లో లేకపోవడంతో చివరికి ధైర్యం చేసి ఆ ఉత్తరంలో నెంబరుకి ఫోన్ చేసాడు.

''హలో'' అవతల నుంచి కోమలమైన కంఠం పలకరించింది.

''ఇండియన్ కౌన్సిలింగ్ ఆఫీసేనాండీ?'' అడిగాడు సుబ్బారావు.

''యెస్'' అన్నదా కోమలమైన కంఠం.

సుబ్బారావు ఆరోజు పోస్టులో తనకొచ్చిన ఉత్తరం గురించి చెప్పాడు.

''ఆ ఉత్తరం రాసింది మేమే. ఇంతకీ నువ్వు ఫోనెందుకు చేసినట్లు మిస్టర్ సుబ్బారావ్?'' అడిగిందా కోమల కంఠం.

రేపో మాపో అమెరికా వెళ్ళి పెద్ద ఉద్యోగం చేయబోతున్న తనని కనీసం గౌరవం కూడా లేకుండా నువ్వు గివ్వు అంటూ మాట్లాడుతున్నందుకు ఒళ్ళు మండిపోయింది సుబ్బారావుకి. అయినా అవతలవైపు మాట్లాడుతున్నది 'లేడీను కదా' పోట్లాడితే బాగోదని సర్ది చెప్పుకున్నాడు.

''నేనెప్పుడూ మీ ఆఫీస్ గురించి వినలేదు...'' నసుగుతూ అన్నాడు సుబ్బారావు.

''నువ్వు విననివీ, నీకు తెలియనివీ ఈ ప్రపంచంలో చాలా వుంటాయి సుబ్బారావ్, ఈమధ్యనే గవర్నమెంటు కొత్తగా పాస్ చేసిన జీవో ప్రకారం విదేశాలకి వెళ్ళడానికి వీసాలకోసం అప్లై చేసిన వాళ్ళందర్నీ అసలు ఆయా దేశాలకి పంపాలా వద్దా అన్న విషయం పరిశీలించి ముందు మన ప్రభుత్వం నిర్ణయించాలి'' చెప్పిందా గొంతు.

''మన గవర్నమెంటుకేం పని లేదు. నిమిషానికో రూలు మారుస్తూంటారు'' విసుగ్గా అనుకోబోయి పైకే అనేసాడు సుబ్బారావు.

''మీకు ఇష్టం లేకపోతే ఇంటర్వ్యూకి రాకండి'' అందామె.

సుబ్బారావు గబుక్కున నాలుక కరుచుకున్నాడు.

'అమ్మో...నా అమెరికా...నా ఉద్యోగం..' అంటూ అతడి గుండెలు గుబ గుబలాడాయి.

''అబ్బెబ్బె...అదేం లేదు మేడమ్, కొత్త కదా... ఇంతకీ మీ ఆఫీసెక్కడ? కొంచెం టెన్షన్‌గా వుంది. ఇంటర్వ్యూలో ఏం అడుగుతారండీ?'' ఆమెని కాకా పట్టడానికి ప్రయత్నించ సాగాడు. అవతల ఆమెకి ఒళ్ళుమండినట్టుంది.

''తినబోతూ రుచెందుకని అడుగుతారు. నోర్మూసుకుని ఫోన్ పెట్టెయ్యవయ్యా..వెధవ ప్రశ్నలూ నువ్వూనూ'' అంది సీరియస్‌గా.

సుబ్బారావ్ గతుక్కుమని ఫోన్ పెట్టేసాడు.

మర్నాడే ఇంటర్వ్యూ!

సుబ్బారావుకి చాలా టెన్షన్‌గా వుంది.

అతనికి జీవితంలో మొదటినుంచీ రెండే రెండు ఆశయాలు.

ఒకటి అమెరికా వెళ్ళడం, రెండు తన మరదలు ఆముక్తమాల్యదని పెళ్ళి చేసుకోవడం.

చిన్నప్పటినుంచీ సుబ్బారావుకి అమెరికా అన్నా ఆముక్తమాల్యద అన్నా చచ్చేంత ఇష్టమూ, మోజూను.

సుబ్బారావు చిన్నతనంలోనే అతనికి వరసకి బాబాయి అయ్యే ఒక బంధువు చదువులకని అమెరికా వెళ్ళి అక్కడే ఉద్యోగంలో స్థిరపడిపోయాడు. బంధువులంతా అతని గురించి గొప్పగా చెప్పుకోవడం, వాళ్ళు ఎప్పుడైనా ఇండియా వస్తే వి.ఐ.పి.లని చూపినట్లు చూడడం చూసిన సుబ్బారావు అంత చిన్న వయసులోనే తను ఉద్యోగమంటూ చేస్తే అమెరికాలోనే చెయ్యాలని నిర్ణయించేసుకున్నాడు. అందుకు అవసరమైన చదువులూ గట్రా పంతంపట్టి మరీ చదివేసాడు.

ఇకపోతే...ఆముక్తమాల్యద!

ఆమె అసలు పేరు సుబ్బలక్ష్మి. ఆమె పుట్టగానే అంతా 'సుబ్బారావుకి పెళ్ళాం పుట్టింది' అనుకున్నారు. పేరు కూడా కలిసొచ్చేలా సుబ్బలక్ష్మి అని పెట్టుకున్నారు. కానీ పెద్దయ్యాక తెలుగు సాహిత్యం బాగా చదివిన సుబ్బలక్ష్మి తన పేరు పాత చింతకాయ పచ్చడిలా వుందని ఆముక్తమాల్యద అని మార్చుకుంది.

వెనువెంటనే సుబ్బారావు కూడా తన పేరు 'ఆనంద్' అని మార్చుకుందామని ఉత్సాహపడిపోయాడు గానీ ఈ పేరు మార్పిడితో పాస్ పోర్టులోనూ వీసాలోనూ తేడా వస్తే తన అమెరికా ప్రయాణానికి ఇబ్బందౌతుందని తెలిసి మాట్లాడకుండా ఊరుకున్నాడు.

ఆముక్తమాల్యద చూడ్డానికి మెరుపుతీగలా వుంటుంది.

ముట్టుకుంటే కరెంటు తీగలా షాక్ కొడుతుంది!

అంతటి అందం, పొగరూ వున్న ఆమెని చూసినప్పుడల్లా పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలి అనుకుంటూ వుండేవాడు సుబ్బారావు.

అలా అనుకుంటూ ఊరుకోలేదు. ఓ మంచి ముహూర్తం చూసుకుని ఆమెని గుళ్ళోకి తీసుకువెళ్ళి అక్కడ తన మనసులోని మాట ఆమెకి చెప్పేసాడు. (గుళ్ళోనే ఎందుకు చెప్పాల్సి వచ్చిందే అంటే...అక్కడైతే ఆమె చెప్పులు వేసుకుని ఉండదన్న ధైర్యం చేత!)

సరిగ్గా అక్కడే కథ అతను ఊహించని మలుపు తిరిగింది.

''నువ్వంటే నాక్కూడా ఇష్టమే బావా..'' అంది ఆముక్తమాల్యద ప్రదక్షిణం మలుపు తిరుగుతూ.


ఆ మాటకి సుబ్బారావు సిగ్గుల మొగ్గైపోయాడు. తన్మయత్వంతో మెలికలు తిరిగిపోయాడు.

''కానీ నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే ఒక షరతు!'' అంది అతన్ని కొబ్బరికాయలు కొట్టే రాయి దగ్గరికి తీసుకు వెళ్ళి.

'కొంపతీసి కొబ్బరికాయ ఆ రాయి మీద కాకుండా నా బుర్రమీద కొట్టి టెస్ట్ చేస్తానంటుందా ఏమిటి?' అనుకున్నాడు భయంగా.

"ఏమిటో చెప్పు" అన్నాడు భయపడుతూనే.

"నువ్వు అమెరికా వెళ్ళే ప్రయత్నాల్లో వున్నావని అత్తయ్య చెప్పింది. కానీ నన్ను పెళ్ళి చేసుకుంటే అమెరికా వెళ్ళడం కుదరదు. మాట్లాడకుండా నాతోపాటూ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకోవడమే. నాకు అమెరికా



వెళ్ళడం ఇష్టం లేదు" అంది కొబ్బరికాయ బద్దలు కొడుతూ.

ఆ కొబ్బరికాయ తన నెత్తిమీద కొట్టినా అంత బాధ పడేవాడు కాదేమో. ఆమె మాటలకి అంతలా విల విలలాడిపోయాడు సుబ్బారావు.

"అది కాదు సుబ్బూ.." అంటూ ఏదో చెప్పబోయాడు.

అతడి మాటల్ని వినిపించుకోకుండా గుళ్ళోకి నడిచింది ఆముక్తమాల్యద.

గుడిలోంచి బయటికొచ్చాక "తేల్చుకో బావా..నీకు నేను ముఖ్యమో అమెరికా వెళ్ళడం ముఖ్యమో" అని చెప్పేసి చెప్పులు వేసేసుకుంది అతనికింకో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.

ఆ తర్వాత వారం రోజులు సుబ్బారావు నిద్రపోలేదు.

కళ్ళు మూసుకుంటే చాలు..త్రాసులో ఒకపక్క అమెరికా డాలర్లు, మరో పక్క ఆముక్తమాల్యద ఊగుతున్నట్లు కలలొస్తున్నాయి. మధ్యలో ఎటూ తేల్చుకోలేక తను వేళ్ళాడుతున్నాడు.

'ఆముక్తమాల్యద కోసం అమెరికా వెళ్ళడం మానెయ్యడమా లేక అమెరికా వెళ్ళడం కోసం ఆముక్తమాల్యదని వదులుకోవడమా?' ఈ డైలాగుని ముందునుంచి వెనక్కీ వెనుకనుంచి ముందుకీ రకరకాల మాడ్యులేషన్స్‌లో ఎన్నిసార్లు అనుకున్నా అతనికి సరైన సమాధానం దొరకలేదు.

చివరాఖరికి అతనికో ఐడియా వచ్చింది.

అమెరికా వెళ్ళి ఒక ఐదారేళ్ళు ఉద్యోగం చేసి తిరిగి ఇండియా వచ్చేసి ఆముక్తమాల్యదని పెళ్ళి చేసుకోవాలని. కొత్తగా కథలు రాయడం మొదలుపెట్టిన రచయితలా తనకొచ్చిన ఐడియాకి తనే మురిసిపోయాడు.

ఆ విషయం ఆముక్తమాల్యదకి చెప్పి ఒప్పించాలనుకున్నాడు. కానైతే ఆమె ఆ తర్వాత అతనితో గుళ్ళోకి రావడానికి ఒప్పుకోకపోవడంతో అది కుదరలేదు!

చేసేది లేక అన్యమనస్కంగానే అమెరికా వెళ్లడానికి ప్రయత్నాలు మొదలుపెట్టేడు. ఫలితంగా ఈ ఉత్తరం వచ్చింది.

★ ★ ★

"సో..మీరేనన్నమాట సుబ్బారావు?" ఆఫీస్‌లోకి అడుగుపెట్టిన సుబ్బారావుని పలకరిస్తూ అంది అక్కడి రిసెప్షనిస్టు.

సుబ్బారావు పళ్ళు పటపటా కొరుక్కుంటూ "అవును" అన్నాడు.

"అయితే ఆ గదిలోకెళ్ళు..ఇంటర్వ్యూ అక్కడ" అంటూ చూపించిందామె ఏమాత్రం మర్యాద లేకుండా.

'ఇంటర్వ్యూ కానీ...నీ పని చెబుతాను' అనుకుంటూ ఆ గదిలోకి అడుగుపెట్టిన అతను అక్కడ కూర్చున్న ఆఫీసర్ని చూడగానే నోట మాట రాకుండా నిలబడిపోయాడు.

అక్కడ ఉన్నది ఎవరో కాదు...

సాక్షాత్తూ తన మరదలు ఆముక్తమాల్యద!

"ఒసేయ్ సుబ్బులూ..నువ్విక్కడున్నావేమిటే?" ఆశ్చర్యంగా అన్నాడు.

ఆముక్తమాల్యద విలాసంగా నవ్వింది. "నిన్ను ఇంటర్వ్యూ చేయబోయే ఆఫీసర్ని నేనే" అంది.

'ఇంక నేనీ ఇంటర్వ్యూలో నెగ్గినట్లే' విరక్తిగా అనుకున్నాడు సుబ్బారావు.

"నీకిక్కడ ఉద్యోగం వచ్చినట్లు నాకు చెప్పలేదేం సుబ్బలక్ష్మీ?" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"అవన్నీ ఇప్పుడనవసరం. ముందు నేనడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పు. నువ్వు అమెరికా ఎందుకు వెళ్ళాలనుకుంటున్నావు?" అంది తను సీరియస్‌గా.

"ఉద్యోగం కోసం. నాకు అక్కడ ఒక కంపెనీలో ఉద్యోగానికి ఆఫర్ వుంది" తడబడుతూ చెప్పాడు సుబ్బారావు.

"ఉద్యోగం కోసం అమెరికానే ఎందుకు వెళ్ళాలి? ఇక్కడ కంపెనీలు లేవా?"

"ఉన్నాయి...కానీ అంత జీతం ఇక్కడ ఏ కంపెనీలోనూ ఇవ్వరు" అన్నాడు సుబ్బారావు కొంచెం ధైర్యం తెచ్చుకుని.

"ఓకే...నిన్ను అమెరికా పంపడం వల్ల మన దేశానికెంత లాభం?"

"ఇందులో లాభనష్టాల ప్రసక్తేముంది? నేను అమెరికా వెళ్ళేది గవర్నమెంటు డబ్బుల్తో కాదు. నా సొంత ఖర్చుతో!" ఆశ్చర్యంగా అన్నాడు సుబ్బారావు.

ఆముక్తమాల్యద సీరియస్‌గా చూసింది.

"నువ్వేం చదువుకున్నావు?" అడిగింది.


సుబ్బారావు తన పట్టాల చిట్టా విప్పేసాడు...గర్వంగా!

"అవన్నీ ఎక్కడ చదువుకున్నావు? ఇండియాలోనేగా? మన దేశం ఏటా విద్యారంగం మీద ఖర్చు పెట్టే మొత్తం ఎంతో తెలుసా నీకు? అందులో నీ వాటా ఎంతో చెప్పగలవా? అంతే కాదు. నీకు బాగా ఇష్టమైన వంటకం చక్రపొంగలి అని తెలుసు నాకు. నువ్వూ చిన్నప్పటినుంచీ ఈరోజు దాకా ముప్పొద్దులా చక్రపొంగలి లాగించేసే నీ శరీరాన్నింత ఏపుగా పెంచావు. మన ప్రభుత్వం ప్రతి యేటా పాడి పరిశ్రమమీద వ్యవసాయ రంగంమీద ఎంత పెట్టుబడి పెడుతోందా నీకు తెలుసా? అంతెందుకు? నువ్వీరోజు ఇంత స్వేచ్ఛగా హాయిగా తిరగ్గల్గుతున్నావంటే ప్రభుత్వం రక్షణరంగం మీద పెట్టుబడి పెడుతున్న కోట్లాది రూపాయలే అని ఎప్పుడైనా ఆలోచించావా నువ్వు?" ఆవేశంగా అంది.

సుబ్బారావు బిక్కమొహం వేసుకుని చూసాడామె మాటలకి.

## అలాంటిదేం లేదు

జూనియర్ ఎన్టీఆర్‌తో సమీరా రెడ్డి 'దోస్తీ' సంగతి ఈమధ్య బాగానే వినిపిస్తోంది! అయితే ఈ విషయమై ఆమెని ఓ ఆసామీ కదిలిస్తే- 'నాకు సినిమాల్లో నటించడానికే టైము చాలడం లేదు. ఇక ఇలాంటి లవ్వులకీ గివ్వులకీ టైమెక్కడా?' అంటూ కొట్టి పారేసింది. అసలు సమీరాని తన కొత్త చిత్రాల్లో నాయికగా ఎన్టీఆర్ రికమెండ్ చేయడం వల్లనే ఆ సినిమాలు ఆరంభం కాకుండానే కాన్సిల్ అయ్యాయని జోరుగా వినిపిస్తోంటే ఆమె ఇలా వ్యాఖ్యానించడం ఆలోచింపజేసేదే మరి! ఏదేమైనా నిప్పులేనిదే పొగ ఎలా వస్తుందంటారు?



"ఇక్కడ పుట్టి పాతికేళ్ళు ఈ నేల మీద పెరిగి, ఇక్కడి తిండి తిని, ఇప్పుడు రెక్కలు రాగానే నీ స్వార్థం నువ్వు చూసుకుంటూ వేరే దేశం వెళ్ళిపోవాలనుకుంటుంటే, నిన్ను పంపడం వల్ల తనకెంత లాభం అని ప్రభుత్వం ఆలోచిస్తే తప్పేముంది?" అంది ఆముక్తమాల్యద.

"నేనేం అక్కడ శాశ్వతంగా ఉండిపోను. కొన్నాళ్ళు ఉద్యోగం చేసి తిరిగి వచ్చేస్తాను. అందువల్ల దేశానికి ఫారిన్ ఎక్స్ఛేంజి వస్తుంది. అక్కడ పనిచేసిన నా అనుభవం పనికొస్తుంది" బింకంగా అన్నాడు సుబ్బారావు.

"నువ్వు మళ్ళీ తిరిగి వస్తావన్న గ్యారంటీ ఏమిటి?" అడిగింది.

సుబ్బారావు ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు. "ఇక్కడ నేను ప్రేమిస్తున్న నా మరదలు వుంది. ఆమెకి అమెరికా రావడం ఇష్టం లేదు. ఆమెని పెళ్ళి చేసుకోవడానికైనా నేను ఇండియా తిరిగి వచ్చేస్తాను"

"సారీ మిస్టర్ సుబ్బారావ్. నాకు నీమీద నమ్మకం లేదు. నీ మరదలి మీద ప్రేమున్న వాడివే అయితే నువ్వీ ఇంటర్వ్యూకే వచ్చేవాడివి కాదు" అంది అతని ఫైల్ అతనికిచ్చేసి షేక్ హ్యాండ్ ఇస్తూ.

ఆ మాటలు అతని గుండెల్లో ముళ్ళలా గుచ్చుకున్నాయ్!

* * *

సుబ్బారావుకి ఒక చేతిలో అమెరికా వెళ్ళడానికి వీసా కోసం ఇంటర్వ్యూకి రమ్మని వచ్చిన కాగితాలూ, మరో చేతిలో హైదరాబాద్‌లోని కంపెనీ ఉద్యోగానికి కాల్ లెటరూ వున్నాయి.

అంతకు ముందైతే కొంచెం ఆలోచించే వాడేమో. ఇప్పుడు స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చేసాడు. వీసా కాగితాలని బరబరా చింపి చెత్తబుట్టలో పడేసాడు.

"ఏమిటి బావా...మనసు మార్చుకున్నావా? నీతోపాటూ ఇంటర్వ్యూకి నేనూ వస్తా పద..ఇద్దరికీ ఒకే కంపెనీలో ఉద్యోగం వస్తే పగలు కూడా నిన్ను చూస్తూనే వుండొచ్చు" అంది ఆముక్తమాల్యద.

"నువ్వెందుకే ఇంటర్వ్యూకి? నీకు ఇండియన్ కౌన్సిలింగ్ ఆఫీస్‌లో ఉద్యోగం వుందిగా" ఆశ్చర్యంగా అన్నాడు సుబ్బారావు.

"నీకింకా తెలియలేదా? అది ఇండియన్ కౌన్సిలింగ్ ఆఫీసు కాదు నీ మనసు మార్చడం కోసం తెరిచిన ఈ సుబ్బలక్ష్మి కౌన్సిలింగ్ ఆఫీస్. మా ఫ్రెండ్సుతో కలిసి ఆడిన డ్రామాకి స్టేజ్" పకపకా నవ్వుతూ చెప్పింది అసలు విషయం.

"అంటే..అదంతా నాటకమా?"

"లేకపోతే...మన రాజకీయ నేతలకి అంతగా ఆలోచించడానికి టైమెక్కడుంది?" నవ్వుతూనే అంది ఆముక్తమాల్యద.

'అమ్మ సుబ్బలక్ష్మీ!' అనుకున్నాడు సుబ్బారావు.